# వరంగల్ వాయిస్
Evening Daily

సంపుటి : 04 | సంచిక : 295
పేజీలు : 08 | వెల: రూ.5/-
గురువారం
సెప్టెంబర్ 04, 2025
www.epaper.warangalvoice.net | www.warangalvoice.net





8లో..

## శోభా యాత్రకు పటిష్ట బందోబస్తు

- విధుల్లో 2,100 సిబ్బంది
- డ్రోన్లు, సీసీ కెమెరాలతో పర్యవేక్షణ
- వరంగల్ పోలీస్ కమిషనర్ సన్‌ప్రీత్ సింగ్



2లో..

## దేశ సంక్షేమమే కేంద్రం లక్ష్యం

- ఆర్థిక భారాన్ని తగ్గించేందుకు జీఎస్టీలో మార్పులు
- భారీగా తగ్గనున్న ధరలు
- బీజేపీ వరంగల్ జిల్లా అధ్యక్షుడు గంట రవికుమార్
- వరంగల్ చౌరస్తాలో మోడీ చిత్రపటానికి పాలాభిషేకం



8లో..

## అభివృద్ధిని పరుగులు పెట్టించాలి

- పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి
- కుడా చైర్మన్, కలెక్టర్, కమిషనర్, ఇతర అధికారులతో సమీక్ష



## చిన్నారి గోలి శ్రీ వైష్ణవికి సత్కారం

హనుమకొండ సుభాష్ నగర్‌లోని శ్రీ విఘ్నేశ్వర యూత్ గజానన మండలి ఆధ్వర్యంలో బుధవారం రాత్రి సాంస్కృతిక కార్యక్రమాలు జరిగాయి. మయూరి నాట్య కళా మండలి వ్యవస్థాపకురాలు కుండె అరుణ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి సతీమణి నీలిమా రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా గోలి రవి-శ్రావణిల కుమార్తె గోలి శ్రీ వైష్ణవి తన అద్భుతమైన నృత్య ప్రదర్శనతో ప్రేక్షకులను ఎంతగానో అలరించింది. వైష్ణవి ప్రదర్శనకు ముగ్ధులైన శ్రీ విఘ్నేశ్వర యూత్ గజానన మండలి సభ్యులు, ఎమ్మెల్యే సతీమణి నీలిమా రెడ్డి చేతుల మీదుగా ఆమెకు సత్కారం చేసి షీల్డ్ బహుకరించారు. ఈ కార్యక్రమంలో డివిజన్ కాంగ్రెస్ అధ్యక్షురాలు గాండ్ల స్రవంతి, శ్రీ విఘ్నేశ్వర యూత్ గజానన మండలి నిర్వహాకుడు గణేష్, కాంగ్రెస్ నాయకులు, స్థానికులు, నాట్య విద్యార్థులు, మహిళలు పాల్గొన్నారు.

– వరంగల్ వాయిస్, హనుమకొండ




# బీరు కావాలా బాబు..!

- ఇక హోటల్స్, రెస్టారెంట్లలోనూ విక్రయం
- మైక్రో బ్రూవరీల ఏర్పాటుకు గ్రీన్ సిగ్నల్
- గ్రేటర్ వరంగల్‌తో పాటు మరో ఐదు కార్పొరేషన్ల పరిధిలో ఏర్పాటు
- నోటిఫికేషన్ జారీ చేసిన ఎక్సైజ్ శాఖ
- ఈ నెల 25 వరకు దరఖాస్తు చేసుకునే అవకాశం



వివరాలు2లో..



బీరు కావాలా బాబు.. అయితే మీరు గతంలో మాదిరిగా బార్ అండ్ రెస్టారెంట్ లకు వెళ్లాల్సిన పనిలేదు.. వైన్ షాపుల్లో కొనుగోలు చేయాల్సిన అవసరం అంతకంటే లేదు.. ఎవరో చూస్తారన్న జంకు, బెరకు అవసరమే లేదు. ఇక మీదట హోటల్ కు వెళ్లి టిఫిన్ తిన్నంత ఈజీగా బీరు తాగొచ్చు. రానున్న రోజుల్లో హోటళ్లు, రెస్టారెంట్లు, టిఫిన్ సెంటర్లు, పర్యాటక స్థలాల్లో ఎక్కడైనా బీరును కొనుగోలు చేసే వెసులుబాటును రాష్ట్ర ప్రభుత్వం కల్పిస్తోంది. అప్పటికప్పుడు, అక్కడికక్కడే స్థానిక రుచులకు అనుగుణంగా తయారు చేసిన బీరును మద్యం ప్రియులు ఆస్వాదించే వెసులు బాటును ఎక్సైజ్ శాఖ అందుబాటులోకి తెస్తోంది. తెలంగాణ కోర్ అర్బన్ రీజియన్ (టీసీయూఆర్)తో పాటు వరంగల్, కరీంనగర్, నిజామాబాద్, ఖమ్మం, మహబూబ్ నగర్, అదిలాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ల పరిధిలో మైక్రో బ్రేవరీల ఏర్పాటుకు ఎక్సైజ్ శాఖ బుధవారం నోటిఫికేషన్ జారీ చేయగా గురువారం నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నారు. ఈ నెల 25 వరకు దరఖాస్తు చేసుకునే అవకాశం కల్పించారు. బీరు అమ్మాలంటే బార్ లైసెన్సు అవసరం లేదు.. వైన్ షాపులకు టెండర్లు వేయాల్సిన పని లేకపోవడంతో మైక్రో బ్రూవరీలకు మంచి స్పందన లభిస్తుందని ఎక్సైజ్ శాఖ భావిస్తోంది.

- వరంగల్ వాయిస్ ప్రతినిధి



# బీరు కావాలా బాబు..!




- ఇక హోటల్స్, రెస్టారెంట్లలోనూ విక్రయం
- మైక్రో బ్రూవరీల ఏర్పాటుకు గ్రీన్ సిగ్నల్
- గ్రేటర్ వరంగల్ తో పాటు మరో ఐదు కార్పొరేషన్ల పరిధిలో ఏర్పాటు
- నోటిఫికేషన్ జారీ చేసిన ఎక్సైజ్ శాఖ
- ఈ నెల 25 వరకు దరఖాస్తు చేసుకునే అవకాశం

**వరంగల్ వాయిస్ ప్రతినిధి :** తెలంగాణ కోర్ అర్బన్ రీజియన్ (టీసీయూఆర్) తో పాటు వరంగల్, కరీంనగర్, నిజామాబాద్, ఖమ్మం, మహబూబ్ నగర్, అదిలాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ల పరిధిలో మైక్రో బ్రూవరీల ఏర్పాటుకు తెలంగాణ ఎక్సైజ్ శాఖ బుధవారం నోటిఫికేషన్ జారీ చేసింది. ఈ నోటిఫికేషన్ మేరకు గురువారం నుంచి దరఖాస్తులు స్వీకరణ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ నెల 25వ తేదీ వరకు దరఖాస్తు చేసుకునే అవకాశం కల్పించారు. దరఖాస్తు దారులకు వెయ్యి చదరపు అడుగుల స్థలం ఉంటే చాలు మైక్రో బ్రూవరీ ఏర్పాటు చేసుకునేందుకు ప్రభుత్వం అనుమతి మంజూరు చేస్తుంది. అయితే ఒక్కో దరఖాస్తు దారుడు రూ.లక్ష రుసుం చెల్లించాల్సి ఉంటుంది. ఇది తిరిగి చెల్లించబడదు.

**హోటల్స్, రెస్టారెంట్లలోనూ..**

గతంలో మాదిరిగా మీరు బీరు తాగేందుకు బార్ అండ్ రెస్టారెంట్లు, వైన్ షాపులకు వెళ్లాల్సిన పనిలేదు. టిఫిన్ తిన్నంత ఈజీగా బీరు తాగే వెసులుబాటును ప్రభుత్వం కల్పిస్తోంది. ఫోటళ్లు, రెస్టారెంట్లు, టిఫిన్ సెంటర్లు, పర్యాటక స్థలాల్లో ఎక్కడైనా మీరు తాగునీటిని కొనుగోలు చేసినట్లుగానే బీర్లను కూడా కొనుగోలు చేయవచ్చు. అయితే మైక్రో బ్రూవరీలు ఏర్పాటు చేయాలంటే కనీసం వెయ్యి చదరపు అడుగల స్థలంలో విస్తరించి ఉన్న హోటల్, రెస్టారెంట్ అయితే చాలన్న నిబంధన విదించారు. స్థానిక రుచుకులను అనుగుణంగా అక్కడే తయారు చేసి ఏంచక్కా అమ్ముకోవచ్చు. ఈ మేరకు రాష్ట్ర వ్యాప్తంగా మైక్రో బ్రూవరీల ఏర్పాటుకు ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది.

**మద్యం ప్రియులకు ఊరట..**

మైక్రో బ్రూవరీల ఏర్పాటుతో మద్యం ప్రియులకు ఊరట లభించనుంది. ఎక్కడికో వెళ్లకుండా తమ సమీపంలోని హోటల్, రెస్టారెంట్ లోనే బీర్లు కొనుగోలు చేసే అవకాశం లభించడంతో మద్యం ప్రియులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. ఆయా ప్రాంతాల పరిధిలోని బార్లు, ఎలైట్ బార్లు, క్లబ్ లు, పర్యాటక స్థలాలు, హోటళ్లు, రెస్టారెంట్లతోపాటు నిబంధనల మేరకు అన్ని అనుమతులతో ఆహార పదార్థాలను అందజేసే సంస్థలు కూడా దరఖాస్తు చేసుకునేందుకు ప్రభుత్వం అవకాశం కల్పించింది.

**దరఖాస్తు రుసుం రూ.లక్ష..**

మైక్రో బ్రూవరీలు ఏర్పాటు చేసుకునేందుకు రూ.లక్ష దరఖాస్తు రుసుం కింద చెల్లించాల్సి ఉంటుంది. వీటిని తిరిగి చెల్లించరు. ఈ నెల 25 వ తేదీ లోగా దరఖాస్తులు స్వీకరించనున్నారు. ఈ నోటిఫికేషన్ మేరకు ఎక్కడ ఎన్ని దరఖాస్తులు వచ్చినా అన్ని మైక్రో బ్రూవరీలను మంజూరు చేస్తామని ఎక్సైజ్ శాఖ అధికారులు ప్రకటిస్తున్నారు. అయితే తాము పెట్టిన నిబంధనల మేరకే అనుమతులు ఉంటాయంటున్నారు. ప్రతి మైక్రో బ్రూవరీ యజమాని ఏడాదికి రూ.5 లక్షల లైసెన్స్ ఫీజును చెల్లించాల్సి ఉంటుందని ఎక్సైజ్ వర్గాలు చెబుతున్నాయి. టీసీయూఆర్ పరిధిలోని జీహెచ్ఎంసీతోపాటు బోడుప్పల్, జవహర్ నగర్, ఫీర్జాదిగూడ, నిజాంపేట, బడంగ్ పేట, బండ్లగూడ జాగీర్, మీర్ పేట మున్సిపల్ కార్పొరేషన్ల పరిధిలోని వారు నాంపల్లిలోని ఎక్సైజ్ శాఖ కార్యాలయంలో తమ దరఖాస్తులను అందజేయాల్సి ఉంటుంది. మిగిలిన ఆరు మున్సిపల్ కార్పొరేషన్లలో ఎక్కడికక్కడే ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ల కార్యాలయాల్లో దరఖాస్తు చేసుకునే వెసులుబాటు కల్పించారు.



# దేశ సంక్షేమమే కేంద్రం లక్ష్యం

- ఆర్థిక భారాన్ని తగ్గించేందుకు జీఎస్టీలో మార్పులు
- భారీగా తగ్గనున్న ధరలు
- బీజేపీ వరంగల్ జిల్లా అధ్యక్షుడు గంట రవికుమార్
- వరంగల్ చౌరస్తాలో మోడీ చిత్రపటానికి పాలాభిషేకం

**వరంగల్ వాయిస్, వరంగల్ :** దేశ ప్రజల సంక్షేమమే లక్ష్యంగా భారత ప్రధాని నరేంద్ర మోడీ ముందుకు సాగుతున్నారని, ప్రజలపై ఆర్థిక భారాన్ని తగ్గించేందుకు జీఎస్టీ ధరలను భారీగా తగ్గించడం హర్షనీయమని బీజేపీ వరంగల్ జిల్లా అధ్యక్షుడు గంట రవికుమార్ అన్నారు. దేశ ప్రజల ఆరోగ్య భద్రత, మధ్యతరగతి కుటుంబాలకు లబ్ది చేకూర్చేలా జీఎస్టీలో మార్పులను స్వాగతిస్తూ గురువారం వరంగల్ చౌరస్తాలో ప్రధాని నరేంద్ర మోడీ, ఆర్థికమంత్రి నిర్మల సీతారామన్ ల చిత్రపటాలకు పాలాభిషేకం చేశారు. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా హాజరైన గంట రవికుమార్ మాట్లాడుతూ జీఎస్టీ తగ్గింపుతో వ్యక్తిగత జీవిత బీమా, ఆరోగ్య బీమా, సీనియర్ సిటిజన్ పాలసీల ప్రీమియంపై టోటల్ జీఎస్టీని ఎత్తివేశారన్నారు. వ్యాపారులకు జీఎస్టీ రిజిస్ట్రేషన్, రిటర్నుల ఫైలింగ్, రీఫండ్ ప్రక్రియలు సులభతరం కావడమే కాక, మానవ శ్రమ అవసరమయ్యే పరిశ్రమలను ప్రోత్సహించేలా చర్యలు కేంద్రం తీసుకోవడం ఆనందంగా ఉందన్నారు. ఓవైపు అమెరికా కుట్రపూరితంగా భారతదేశంపై సుంకాల భారం మోపుతున్నా నరేంద్ర మోడీ దేశ ప్రజల ఆర్థిక అభివృద్ధి కోసం జీఎస్టీని గణనీయంగా తగ్గించడం సంతోషించదగిన విషయం అన్నారు. ప్రధాని మోడీ తన చతురతతో ప్రపంచ దేశాల్లో భారత దేశ ఔన్నత్యాన్ని చాటుతున్నారన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కుసుమ సతీష్, రత్నం సతీష్ షా, ఎస్సీ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షులు బన్న ప్రభాకర్, ఓబీసీ మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యులు బైరి మురళీకృష్ణ, గోగికార్ అనిల్, సీనియర్ నాయకులు సముద్రాల పరమేశ్వర్, జిల్లా ప్రధాన కార్యదర్శి బాకం హరి శంకర్, జిల్లా ఉపాధ్యక్షులు ఎరుకుల రఘునారెడ్డి, జిల్లా కోశాధికారి కూచన క్రాంతి కుమార్, ఎస్సీ మోర్చా జిల్లా అధ్యక్షులు పోలేపాక మార్టిన్ లూథర్, జిల్లా కిసాన్ మోర్చా అధ్యక్షులు బైరి నాగరాజు, బీజేవైఎం జిల్లా అధ్యక్షులు ఎర్రగొల్ల భరత్ వీర్, జిల్లా సోషల్ మీడియా కన్వీనర్ నోముల రతన్, జిల్లా ప్రచార కార్యదర్శి బైరి శ్యాంసుదర్, మండల అధ్యక్షులు మహమ్మద్ రఫీ, అపురూప రజనీష్, తాళ్ల పెల్లి అర్జున్ గౌడ్, నాయకులు అంకాల జనార్ధన్, అల్లి అజయ్, జెట్లింగ్ శివప్రసాద్, కందుకూరి శ్రీనివాస్, కందగట్ల మల్లికార్జున్, పనికేలా శ్రీనివాస్, నలివేల సతీష్, మహిళా మోర్చా నాయకురాలు పబ్బ ఉమాదేవి, కూరతోట రాజేశ్వరి తదితరులు పాల్గొన్నారు.



# ఏక వీర ఆలయ పునరుద్ధరణ

☐ క్షేత్ర స్థాయిలో సందర్శించిన కమిషనర్ చాహత్ బాజ్ పాయ్

**వరంగల్ వాయిస్, మొగిలిచర్ల :** మొగిలిచర్లలోని పురాతన కాకతీయుల ఏక వీర ఆలయ పునరుద్ధరణను త్వరితగతిన పూర్తి చేయాలని కుడా వైస్ చైర్మన్, జీడబ్ల్యూఎంసీ కమిషనర్ చాహత్ బాజ్ పాయ్ కోరారు. ఏక వీర ఆలయాన్ని గురువారం ఆమె క్షేత్ర స్థాయిలో సందర్శించారు. ఈ కార్యక్రమంలో కుడా సీపీఓ అజిత్ రెడ్డి, ఎంహెచ్ఓ డాక్టర్ రాజేష్, కుడా ఈఈ భీమ్ రావు, టార్చ్ సంస్థ ప్రతినిధి అరవింద్ పాల్గొన్నారు.

# కుట్ర పూరితంగానే కేసులు

- అంబేద్కర్ ను అవమానించిన వారిపై చర్యలు తీసుకోవాలి
- సీపీకి టీయూడబ్ల్యూజే 143 నేతల వినతి



**వరంగల్ వాయిస్, క్రైం :** వరంగల్ ప్రెస్ క్లబ్ ప్రస్తుత కమిటీ బాధ్యుల కాల పరిమితి పూర్తయినప్పటికీ పదవులను పట్టుకొని వేళ్లాడడమే కాకుండా భారత రత్న డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విగ్రహాన్ని అవమానించేలా తొలగించారని టీయూడబ్ల్యూజే 143 ఉమ్మడి వరంగల్ జిల్లా నాయకులు, ప్రెస్ క్లబ్ కమిటీ సభ్యులు ఆరోపించారు. ఈ మేరకు గురువారం వరంగల్ సీపీ సన్ ప్రీత్ సింగ్ ను కలిసి వినతిపత్రం అందజేశారు. అంబేద్కర్ కు జరిగిన అవమానాన్ని వ్యతిరేకిస్తూ ప్రెస్ క్లబ్ ఆవరణలో నిరసన తెలిపిన వారిపై సుబేదారి పీఎస్ లో ఫిర్యాదు చేయగా వారిపై ఎస్సీ, ఎస్టీ కేసు నమోదు చేశారన్నారు. ప్రెస్ క్లబ్ అధ్యక్ష, అధ్యక్షా కార్యదర్శులు నాగరాజు, సదయ్య కుట్రపూరితంగా వ్యవహరిస్తూ మాపై కేసులు పెడుతున్నారని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో టీయూడబ్ల్యూజే 143 రాష్ట్ర ఉపాధ్యక్షులు బీఆర్ లెనిన్, హనుమకొండ వరంగల్ జిల్లా అధ్యక్షులు మస్కపురి సుధాకర్, ప్రధాన కార్యదర్శి కోరుకొప్పుల నరేందర్, అర్షం రాజ్ కుమార్, వాంకే శ్రీనివాస్, టీఈఎంజేయూ నేతలు బూరం ప్రశాంత్, టి.వేణు, నవణీత్, నీలం శివ, యూనియన్ నేతలు పెరుమాండ్ల వెంకట్, తుమ్మ శ్రీధర్ రెడ్డి, కక్కెర్ల అనిల్, పొగాకుల అశోక్, దొంతు నవీన్, సతీష్, అనిల్, కిషోర్, ప్రెస్ క్లబ్ ఉపాధ్యక్షులు గోకరాపు శ్యామ్, బోడిగే శ్రీను, దొమ్మటి శ్రీకాంత్, తిరుమల్, వంశీ పాల్గొన్నారు.

# కేసీఆర్ పై సీబీఐ విచారణ రద్దు చేయాలి

**◆ మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకట రమణా రెడ్డి**

**◆ రైతు వ్యతిరేక విధానాలపై నిరసన**



**వరంగల్ వాయిస్, టేకుమట్ల :** కాంగ్రెస్ ప్రభుత్వం అనుసరిస్తున్న రైతు వ్యతిరేక విధానాలను నిరసిస్తూ, అలాగే కాళేశ్వరం ప్రాజెక్టుపై సీబీఐ విచారణకు ఆదేశించిన రేవంత్ రెడ్డి కుట్రపూరిత రాజకీయాలకు వ్యతిరేకంగా టేకుమట్ల మండల కేంద్రంలో బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి భూపాలపల్లి మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకట రమణా రెడ్డి గారు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. మండల బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు సట్ల రవి ఆధ్వర్యంలో జరిగిన ఈ నిరసనలో మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకట రమణా రెడ్డి పార్టీ నేతలతో కలిసి రోడ్డుపై బైఠాయించి ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. రైతు సంక్షేమం కోసం పాటుపడిన తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ గారిపై అక్రమ ఆరోపణలు చేయడాన్ని తీవ్రంగా ఖండించారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రాన్ని అన్ని రంగాలలో ముందుకు తీసుకెళ్లిన కేసీఆర్‌పై అవినీతి ఆరోపణలు చేయడం దుర్మార్గమని అన్నారు. వెంటనే కేసీఆర్ పై సీబీఐ విచారణ రద్దు చేయాలని డిమాండ్ చేశారు. నిరసనలో భాగంగా రేవంత్ రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ కార్యక్రమంలో మండల బీఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# దయ్యాల రాకేష్ భానుకు గురు బ్రహ్మ అవార్డు



**వరంగల్ వాయిస్, దామెర :** మండలంలోని డిస్నీల్యాండ్ హై స్కూల్ డైరెక్టర్, ప్రిన్సిపాల్ దయ్యాల రాకేష్ భాను గురు బ్రహ్మ అవార్డు అందుకున్నారు. హైదరాబాద్ లోని శ్రీ పొట్టి శ్రీరాములు ఆడిటోరియంలో బుధవారం జరిగిన బహుమతుల ప్రధానోత్సవంలో ఈ అవార్డును ఆయనకు ప్రదానం చేశారు. ఎస్ఆర్ఎఫ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో, లోక్ సత్తా అధ్యక్షుడు, మాజీ ఐపీఎస్ అధికారి జయప్రకాశ్ నారాయణ, ఎస్ఆర్ఎఫ్ ఫౌండేషన్ మేనేజింగ్ డైరెక్టర్ తుమ్మ అమరేష్ చేతుల మీదుగా రాకేష్ భాను ఈ అవార్డును స్వీకరించారు. పాఠశాల అభివృద్ధికి, విద్యార్థులకు ఆయన అందిస్తున్న సేవలకు గుర్తింపుగా ఈ పురస్కారం లభించింది. ఈ సందర్భంగా పాఠశాల డైరెక్టర్లు దయ్యాల మల్లయ్య, దయ్యాల సదయ్య, బాలుగు లక్ష్మీనివాసం, బాలుగు శోభారాణి, దయ్యాల దినేష్ చందర్ రాకేష్ భానును అభినందించారు. ఆయన ఈ అవార్డు పొందడం తమందరికీ గర్వకారణమని వారు పేర్కొన్నారు. డిస్నీల్యాండ్ పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు సైతం రాకేష్ భానుకు అభినందనలు తెలిపారు.

# ఎరువుల దుకాణాల తనిఖీ



**వరంగల్ వాయిస్, పరకాల:** పరకాలలో నూతనంగా బాధ్యతలు స్వీకరించిన ఏడీఏ జగదీశ్వర్ రెడ్డి పట్టణంలోని ఎరువుల దుకాణాలను తనిఖీ చేశారు. ఇందులో భాగంగా అరుణ ఫర్టిలైజర్స్, పెస్టిసైడ్స్, సీడ్స్ షాపును ఆయన పరిశీలించారు. ప్రస్తుతం యూరియా కొరత ఉన్న నేపథ్యంలో వ్యాపారులు పాటించాల్సిన నిబంధనలను ఆయన వివరించారు. యూరియా కొనుగోలుకు ఆధార్ కార్డు అనుసంధానం తప్పనిసరి అని, ఈ-పాస్ మిషన్ ద్వారా మాత్రమే రైతులకు యూరియాను విక్రయించాలని ఏడీఏ జగదీశ్వర్ రెడ్డి సూచించారు. రైతులు ఏ మండలంలో ఉన్నారో ఆ మండల పరిధిలోనే యూరియా తీసుకోవాలని తెలిపారు. అలాగే, దుకాణదారులు తమ స్టాక్ బోర్డులో ఎరువుల నిల్వ, ధర వివరాలను తప్పకుండా పొందుపరచాలని ఆదేశించారు. స్టాక్ రిజిస్టర్లను ఎప్పటికప్పుడు అప్‌డేట్ చేయాలని ఆయన వ్యాపారులకు స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ఏడీఏ జగదీశ్వర్ రెడ్డి, పరకాల వ్యవసాయ అధికారి శ్రీనివాస్ పాల్గొన్నారు.

# విజయలక్ష్మి కాలనీలో అన్నదానం

**హనుమకొండ, వరంగల్ వాయిస్:** గణపతి నవరాత్రి ఉత్సవాలను పురస్కరించుకుని హనుమకొండలోని గ్రేటర్ వరంగల్ 02వ డివిజన్, రెడ్డిపురం విజయలక్ష్మి కాలనీలో గురువారం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. శ్రీ పోచమ్మ తల్లి గజానన మండలి ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. ఈ అన్నదానంలో కాలనీ వాసులు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని ప్రసాదాన్ని స్వీకరించారు. కార్యక్రమాన్ని విజయవంతం చేయడంలో మండలి కమిటీ సభ్యులు కృషి చేశారు.



# నవరాత్రి ఉత్సవాల్లో ఎమ్మెల్యే నాయిని సతీమణి



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** వినాయక నవరాత్రి ఉత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. ఈ సందర్భంగా వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి, ఆయన సతీమణి నీలిమ గురువారం నగరంలోని పలు గణేష్ మండపాలను సందర్శించారు. అక్కడ గణపతికి ప్రత్యేక పూజలు నిర్వహించిన నాయిని దంపతులు, "గణపతి బప్పా ఆశీస్సులతో ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో, అభివృద్ధిలో జీవించాలి" అని ఆకాంక్షించారు. స్థానిక ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# అష్టకష్టాలు పడుతున్న 104 ఉద్యోగులు

**రామ రాజేష్ ఖన్నా**



**హైదరాబాద్, వరంగల్ వాయిస్:** తెలంగాణ రాష్ట్రంలో పనిచేస్తున్న 104 ఉద్యోగులకు గత ఐదు నెలలుగా జీతాలు అందక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని జాతీయ ఆరోగ్య మిషన్ కాంట్రాక్ట్ అండ్ ఔట్‌సోర్సింగ్ ఎంప్లాయిస్ (ఏఐటీయూసీ అనుబంధం) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రామ రాజేష్ ఖన్నా ఆవేదన వ్యక్తం చేశారు. 2025 ఏప్రిల్, మే, జూన్, జూలై, ఆగస్టు నెలల వేతనాలు ఇప్పటికీ పెండింగ్‌లో ఉన్నాయని, వాటిని వెంటనే విడుదల చేయాలని ఆయన ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కాంట్రాక్టు పద్ధతిలో పనిచేస్తున్న అన్ని క్యాడర్ల ఉద్యోగులకు వేతనాలు చెల్లించాలని కోరారు. లేకపోతే, రాబోయే 20 రోజుల్లో 104 ఉద్యోగులందరితో కలిసి హైదరాబాద్‌లో ధర్నా చేపడతామని రామ రాజేష్ ఖన్నా హెచ్చరించారు. ప్రభుత్వం ఈ సమస్యను తక్షణమే పరిష్కరించాలని ఉద్యోగులు విజ్ఞప్తి చేస్తున్నారు.

# సైడ్ డ్రైనేజీ పనులు ప్రారంభం




**వరంగల్ వాయిస్, గణపురం :** మండలంలోని అప్పలపల్లి గ్రామంలో అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టారు. గ్రామ ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు ఆదేశాల మేరకు అప్పలపల్లి గ్రామంలో నాలుగు కోట్ల రూపాయల అంచనా వ్యయంతో సైడ్ డ్రైనేజీ నిర్మాణ పనులను కాంట్రాక్టర్ రాజి రెడ్డి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఏఈ ఎం.నరేష్, కాంట్రాక్ట్ ఇంజనీర్ రాకేష్ పాల్గొన్నారు. కాంగ్రెస్ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షుడు కొడారి రవీందర్, మాజీ వార్డ్ మెంబర్ పిడిశెట్టి దేవేందర్, మాజీ సర్పంచ్ దోమల రవీందర్, ఎస్సీ సెల్ మండల ప్రధాన కార్యదర్శి ఎలుక పెల్లి రమేష్, గ్రామ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు దోమల రాజయ్య, కొప్పుల దేవేందర్, కొప్పుల ఆయిల్, కొమురు వీరమల్ల సమ్మిరెడ్డి, ముక్కెర సాంబయ్య, శనిగరపు భద్రయ్య, కారోబార్ మధ్యల రాజు, గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# మృతురాలి కుటుంబానికి పరామర్శ



**వరంగల్ వాయిస్, గణపురం :** మండల కేంద్రానికి చెందిన దేసు ప్రదీప్ సతీమణి స్వర్ణ అనారోగ్యంతో మృతి చెందగా, భూపాలపల్లి శాసనసభ్యులు గండ్ర సత్యనారాయణ రావు గురువారంవారి నివాసానికి వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించారు. వారి కుటుంబానికి ఆయన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు వెంట జిల్లా నాయకులు కటుకూరి శ్రీనివాస్, మాజీ ఎంపీపీ వడ్లకొండ నారాయణ గౌడ్, గ్రామ కమిటీ అధ్యక్షులు ఓరుగంటి కృష్ణ, జిల్లా యువజన కాంగ్రెస్ నాయకులు పోశాల మహేష్ గౌడ్, మండల నాయకులు నేరెళ్ల రాజు, యువజన నాయకులు కార్తీక్, కార్యకర్తలు ఉన్నారు.

# హరీష్ రావుపై కవిత వాఖ్యలు సబబు కాదు

**◆ మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి**

**వరంగల్ వాయిస్, పరకాల :** మాజీ మంత్రి హరీశ్ రావుపై జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత చేసిన ఆరోపణలను పరకాల మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి తీవ్రంగా ఖండించారు. బీఆర్ఎస్ పార్టీ అధినేత కె. చంద్రశేఖర్ రావుతోపాటు, హరీశ్ రావుకు కూడా తాము అండగా ఉంటామని ఆయన స్పష్టం చేశారు. ఈ మేరకు ధర్మారెడ్డి ఒక ప్రకటన విడుదల చేశారు. ధర్మారెడ్డి తన ప్రకటనలో కేసీఆర్ మార్గదర్శకత్వంలో హరీశ్ రావు పనిచేస్తున్నారని, పార్టీ ఆవిర్భావం నుంచి దాని పటిష్టతకు ఎంతో కృషి చేశారని తెలిపారు. ఉద్యమ సమయంలో, పరిపాలనలో, ఇప్పుడు ప్రతిపక్షంలోనూ హరీశ్ రావు ఎప్పుడూ కేసీఆర్ వెన్నంటే ఉన్నారని ఆయన గుర్తు చేశారు. అన్ని వర్గాల ప్రజల సమస్యల కోసం ముందుండి పోరాటం చేసిన హరీశ్ రావుపై కవిత చేసిన వ్యాఖ్యలు సరికాదని ఆయన అన్నారు. "కన్న తండ్రిని, కన్నతల్లిలాంటి పార్టీకి ద్రోహం చేయాలని చూస్తే సహించేదిలేదు" అని ధర్మారెడ్డి వ్యాఖ్యానించారు. బీఆర్ఎస్ కుటుంబ సభ్యులందరూ కవితను ఒక సోదరిలా భావించారని, ఆమె ఇప్పుడు పునరాలోచించుకోవాలని సూచించారు. పార్టీని విచ్ఛిన్నం చేయాలని చూస్తే బీఆర్ఎస్ శ్రేణులు చూస్తూ ఊరుకోరని, అందుకు ధీటుగా సమాధానం చెబుతారని ఆయన హెచ్చరించారు. పార్టీకి, కేసీఆర్‌కు అన్యాయం చేయాలని చూస్తే ఊరుకునేది లేదని ధర్మారెడ్డి స్పష్టం చేశారు.



# ఉపాధి హామీ చట్ట పరిరక్షణకు పోరాడాలి

◆ తాటిపాముల వెంకట్రాములు

**వరంగల్ వాయిస్, జనగామ :** మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని నిర్వీర్యం చేస్తున్న కేంద్ర ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా వ్యవసాయ కార్మికులు ఐక్యంగా పోరాడాలని భారతీయ ఖేత్ మజ్దూర్ యూనియన్ (బీకేఎంయూ) జాతీయ కార్యవర్గ సభ్యుడు తాటిపాముల వెంకట్రాములు పిలుపునిచ్చారు. గురువారం జనగామలో పిట్టల కుమారస్వామి అధ్యక్షతన జరిగిన జిల్లా వ్యవసాయ కార్మిక మూడో మహాసభలో ఆయన ముఖ్య అతిథిగా ప్రసంగించారు. పోరాటాల ద్వారా సాధించుకున్న హక్కులను పాలకులు కాలరాస్తున్నారని వెంకట్రాములు ఆవేదన వ్యక్తం చేశారు. ఇళ్ల స్థలాలు, పక్కా గృహాలు, సంక్షేమ పథకాల కోసం పోరాడాలని ఆయన సూచించారు. ఎన్నికల ముందు ఇచ్చిన వాగ్దానాలను పాలకులు విస్మరించారని, వ్యవసాయ కార్మికులకు సంవత్సరానికి రూ. 12,000 ఇస్తామన్న ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకాన్ని వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. సామాజిక పింఛన్లు రూ. 4,000కు, వికలాంగుల పింఛన్లు రూ. 6,000కు, వ్యవసాయ కార్మికులకు రూ. 6,000 పింఛను పెంచాలని ఆయన ప్రభుత్వాన్ని కోరారు. రాష్ట్ర నాయకులు మోతే లింగారెడ్డి మాట్లాడుతూ తమ డిమాండ్ల సాధన కోసం సెప్టెంబర్ 8న కలెక్టర్ కార్యాలయం ముందు




చేపట్టే ధర్నాలను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. సీపీఐ జిల్లా కార్యదర్శి సీహెచ్ రాజారెడ్డి మాట్లాడుతూ వ్యవసాయ కార్మికుల పోరాటాలకు సీపీఐ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. ఈ మహాసభలో మహిళా సమాఖ్య నాయకురాలు పాతూరి సుగుణమ్మ, రైతు సంఘం అధ్యక్షులు ఆది సాయన్న, ప్రధాన కార్యదర్శి సొప్పరి సోమయ్య, ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి ఆకుల శ్రీనివాస్, దళిత సంఘం జిల్లా కార్యదర్శి పైసా రాములు, కుమార్ తదితరులు ప్రసంగించారు. ఈ సందర్భంగా వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడిగా బెజగం ఎల్లయ్య, ప్రధాన కార్యదర్శిగా పిట్టల కుమార్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. వీరితో పాటు 15 మంది సభ్యులతో కూడిన జిల్లా కమిటీని ఎన్నుకున్నారు.

## అన్నప్రసాద వితరణ



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** న్యూ రెడ్డి కాలనీ రోడ్ నెం. 2లోని పీసీ రెసిడెన్సీ అపార్ట్‌మెంట్ వద్ద గురువారం అన్నప్రసాద కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి న్యూ రెడ్డి కాలనీకి చెందిన దాదాపు 300 మంది ప్రజలు హాజరయ్యారు. వినాయక స్వామి ఆశీస్సులతో అపార్ట్‌మెంట్, కాలనీ వాసులందరికీ ఆరోగ్యం, ఆనందం, సౌభాగ్యం కలగాలని కోరుతూ ముందుగా కుంకుమ పూజ నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్నప్రసాదాన్ని పంపిణీ చేశారు. ఈ కార్యక్రమాన్ని నిర్వహించిన వారిలో ఆదిత్య శర్మ, వంశీకృష్ణ ఐలి, అలుగువెల్లి నరేందర్, వెల్పుల నవీన్, రాజేందర్ కొలగాని, తాబేటి రాజేందర్ (రిటైర్డ్ పీడీ), గందారి యాదగిరి, ఆయిలు నరేందర్, టాబేటి సతీష్, గూడేపు శివాజీ, ముస్కు కార్తీక్ పాల్గొన్నారు.



## ఆదర్శ గ్రామంగా కన్నయ్యపల్లి



**వరంగల్ వాయిస్, రఘునాథపల్లి :** రఘునాథపల్లి మండలం కన్నయ్యపల్లి గ్రామం అభివృద్ధిలో ఆదర్శంగా నిలుస్తోంది. ఇందిరమ్మ ఇళ్ల శంకుస్థాపన సందర్భంగా ఎమ్మెల్యే కడియం శ్రీహరి గ్రామానికి పలు అభివృద్ధి పనుల కోసం నిధులు మంజూరు చేశారు. అందులో భాగంగా, గ్రామంలో సీసీ రోడ్ల నిర్మాణానికి రూ. 10 లక్షలు కేటాయించారు. అలాగే, తాగునీటి సమస్యను పరిష్కరించడానికి ఎంపీ కడియం కావ్య నిధుల నుంచి వాటర్ ప్లాంట్ కోసం రూ. 3 లక్షలు మంజూరు చేశారు. ఈ నిధుల ప్రొసీడింగ్ కాపీని వెంటనే గ్రామ పంచాయతీకి అందజేశారు. గ్రామ అభివృద్ధికి కృషి చేస్తున్న ఎమ్మెల్యే కడియం శ్రీహరి, ఎంపీ కడియం కావ్యలకు గ్రామ ప్రజలు ఈ సందర్భంగా ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా యూత్ నాయకులు లోనే శ్రవణ్, గంధమల నరసింహారావు, బాష్పాక కుమార్, నలుగురి ఉపేందర్ తదితరులు పాల్గొన్నారు.

## మతిస్థిమితం లేని వ్యక్తిని కుటుంబ సభ్యులకు అప్పగింత



**వరంగల్ వాయిస్, ఆత్మకూరు :** మతిస్థిమితం కోల్పోయి సంచరిస్తున్న ఓ యువకుడిని ఆత్మకూర్ పోలీసులు గుర్తించి అతడి కుటుంబసభ్యులకు అప్పగించారు. ఈ సంఘటన బుధవారం ఆత్మకూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. హైదరాబాద్‌కు చెందిన అక్రమ్ షేక్ అనే యువకుడు బుధవారం అర్ధరాత్రి ఆత్మకూరు మండలం గూడెప్పాడ్ ప్రాంతంలో అనుమానాస్పదంగా తిరుగుతూ కనిపించాడు. పోలీసులు గస్తీ తిరుగుతున్న సమయంలో అతడిని గమనించి పోలీస్ స్టేషన్‌కు తరలించారు. విచారించగా, అతడు సరైన సమాధానం ఇవ్వలేకపోయాడు. అయితే, అతడి టీషర్ట్‌పై ఉన్న ఫోన్ నంబర్‌ను గుర్తించిన పోలీసులు ఆ నంబర్‌కు ఫోన్ చేసి సమాచారం అందించారు. దీంతో వారు ఆత్మకూరు పోలీస్ స్టేషన్‌కు చేరుకున్నారు. పూర్తి విచారణ అనంతరం అక్రమ్ షేక్‌ను కుటుంబసభ్యులకు అప్పగించినట్లు సీఐ సంతోష్ తెలిపారు.

## వినాయక నిమజ్జనం ప్రశాంతంగా జరుపుకోవాలి

సీఐ ఎడవెల్లి శ్రీనివాస్ రెడ్డి



**వరంగల్ వాయిస్, రఘునాథపల్లి :** వినాయక నిమజ్జనం ప్రశాంతంగా, భక్తిశ్రద్ధలతో జరుపుకోవాలని జనగామ రూరల్ పోలీస్ సర్కిల్ ఇన్స్పెక్టర్ ఎడవెల్లి శ్రీనివాస్ రెడ్డి ప్రజలను కోరారు. నిమజ్జనం సమయంలో అల్లర్లు సృష్టిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు గురువారం ఆయన మీడియాతో మాట్లాడుతూ ఈ విషయం తెలిపారు.వినాయక నవరాత్రి ఉత్సవాలను ఎంత భక్తితో నిర్వహించారో, అదే విధంగా నిమజ్జనాన్ని కూడా ప్రశాంతంగా పూర్తి చేయాలని ఆయన సూచించారు. శోభాయాత్రలో డీజేలు, పెద్ద సౌండ్ బాక్సులను ఉపయోగించి ప్రజలకు ఇబ్బంది కలిగించకూడదని అన్నారు. ఎదురెదురుగా వచ్చే శోభాయాత్రల మధ్య గొడవలకు దిగితే వారిపై కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. నిమజ్జనం ప్రదేశాలైన చెరువులు, కుంటల వద్ద అప్రమత్తంగా ఉండాలని, లోతుకు వెళ్లి ప్రాణాల మీదకు తెచ్చుకోవద్దని ఆయన సూచించారు. రూరల్ పరిధిలోని రఘునాథపల్లి, లింగాల ఘణపురం, చిల్పూర్ పోలీస్ స్టేషన్ల పరిధిలో నిమజ్జనం కోసం భారీ పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశామని తెలిపారు. శోభాయాత్ర మార్గాల్లో పోలీసులు అప్రమత్తంగా ఉంటారని, శాంతిభద్రతలకు విఘాతం కలగకుండా ప్రజలు పోలీసులకు సహకరించాలని ఆయన కోరారు.

## పోలీసుల సూచనలు పాటించాలి




**వరంగల్ వాయిస్, దామెర :** వినాయక చవితి ఉత్సవాలను ప్రశాంతంగా, శాంతియుతంగా జరుపుకోవాలని దామెర పోలీస్ స్టేషన్ పోలీసులు గణేష్ ఉత్సవ నిర్వాహకులకు, కమిటీ సభ్యులకు, ప్రజలకు సూచించారు. ఈ సందర్భంగా పోలీసులు కొన్ని ముఖ్యమైన నిబంధనలను పాటించాలని కోరారు. శోభాయాత్రలో డీజే సౌండ్ బాక్సులను ఉపయోగించరాదు. ఈ నిబంధనను ఉల్లంఘిస్తే వాటిని సీజ్ చేయడంతో పాటు, చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటారు. శోభాయాత్రలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా చూడాల్సిన బాధ్యత ఉత్సవ కమిటీ సభ్యులదే. విద్యుత్ తీగలు, రాకపోకలు సాగించే వాహనాలను గమనిస్తూ యాత్రను నిర్వహించాలి. శోభాయాత్రలో అశ్లీల నృత్యాలు, మత విద్వేషాలను రెచ్చగొట్టే వ్యాఖ్యలు లేదా పాటలు ప్రదర్శించరాదు. శోభాయాత్రలో బాణాసంచా కాల్చడం పూర్తిగా నిషేధం. ఈ నిబంధనను ఉల్లంఘించిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటారు. నిమజ్జనం సమయంలో చెరువులు లేదా కుంటల వద్ద తగు జాగ్రత్తలు పాటించాలి. చిన్న పిల్లలను నీటి వద్దకు వెళ్లనీయకుండా చూసుకోవాలి. శోభాయాత్రను త్వరగా ప్రారంభించి సాయంత్రం 6 గంటలలోపు పూర్తి చేయాలని నిర్వాహకులు చూసుకోవాలి. పై సూచనలను తప్పనిసరిగా పాటించాలని పోలీసులు ఉత్సవ నిర్వాహకులను కోరారు.

## ఘనంగా అన్నప్రసాద వితరణ



**వరంగల్ వాయిస్, పరకాల :** పట్టణంలో గణపతి నవరాత్రి ఉత్సవాలను పురస్కరించుకుని గురువారం పద్మశాలివాడలోని పోచమ్మ గుడి వద్ద మహా అన్నప్రసాద కార్యక్రమం జరిగింది. మార్కండేయ యూత్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమాన్ని మాజీ కౌన్సిలర్ పొరండ్ల సంతోష్ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మాజీ టీపీసీసీ ఉపాధ్యక్షులు దొమ్మటి సాంబయ్య ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఆయన గణపతిని దర్శించుకుని, కొబ్బరికాయ కొట్టి అన్నదానాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా పొరండ్ల సంతోష్, ఓబీసీ చైర్మన్ ఆలేటి రాజు, సోషల్ మీడియా కోఆర్డినేటర్ గడ్డం శివకుమార్, మాజీ ఎంపీటీసీ ఆలేటి రాములుతో పాటు వార్డు మహిళలు సాంబయ్యను శాలువాతో సత్కరించారు. ఈ అన్నప్రసాద కార్యక్రమంలో హనుమకొండ జిల్లా సేవాదళ్ అధ్యక్షులు బొచ్చు చందర్, పరకాల మండల అధ్యక్షులు కట్కూరి దేవేందర్ రెడ్డి, నియోజకవర్గ ఎస్టీ సెల్ అధ్యక్షులు పాలకుర్తి శ్రీనివాస్, సమన్వయ కమిటీ సభ్యులు మడికొండ సంపత్, పసుల రమేష్, బండి సదన్న, మడికొండ శ్రీను, దుబాసి వెంకటస్వామి, మార్కెట్ డైరెక్టర్ దాసరి బిక్షపతి, మాజీ ఎంపీటీసీ మల్లారెడ్డి, మేరుగు శ్రీశైలం, ఉపాధ్యక్షులు ఒంటెరు శ్రవణ్, వర్కింగ్ ప్రెసిడెంట్ పొరండ్ల వేణు, మార్కండేయ యూత్ సభ్యులు, వార్డు ప్రజలు పాల్గొన్నారు.

## మోషన్ కాలేజీలో మహా అన్నదానం

**వరంగల్ వాయిస్, హసన్ పర్తి :** ఎర్రగట్టు గుట్ట వద్ద ఉన్న మోషన్ జూనియర్ కాలేజీలో గణపతి నవరాత్రి ఉత్సవాలను ఘనంగా నిర్వహిస్తున్నారు. ఈ ఉత్సవాల్లో భాగంగా గురువారం మహా అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. గత ఎనిమిది రోజులుగా గణపతి ఉత్సవాలు నిర్వహిస్తున్న కాలేజీ యాజమాన్యం, ఈ అన్నదాన కార్యక్రమాన్ని కూడా తమ ఆధ్వర్యంలో చేపట్టింది. ఈ కార్యక్రమంలో విద్యార్థులు, కాలనీ వాసులు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని అన్నప్రసాదాన్ని స్వీకరించారు. ఈ కార్యక్రమంలో కాలేజీ చైర్మన్ వడ్లకొండ వేణుగోపాల్ గౌడ్, డైరెక్టర్ పెరుమాండ్ల అనిల్ గౌడ్, సభ్యులు వడ్లకొండ సుమలత, సుష్మిత, సిద్దేష్ గౌడ్, మండల రాజు, శనిగరపు సుమన్, మౌనిక తదితరులు పాల్గొన్నారు.



# స్థానిక సంస్థల ఎన్నికల్లో బీజేపీ సత్తా చాటాలి

◆ బీజేపీ రాష్ట్ర నేత జలగం రంజిత్ రావు
◆ వర్ధన్నపేటలో బీజేపీ కార్యశాల

**వరంగల్ వాయిస్, వర్ధన్నపేట :** రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో భారతీయ జనతా పార్టీ గెలుపే లక్ష్యంగా పనిచేయాలని పార్టీ కార్యకర్తలకు పిలుపునిచ్చారు రాష్ట్ర నాయకులు, స్థానిక సంస్థల మండల ఇంచార్జి జలగం రంజిత్ రావు. గురువారం వర్ధన్నపేట మండలం ఇల్లంద గ్రామంలోని భారతీయ జనతా పార్టీ కార్యాలయంలో జరిగిన మండల కార్యశాల కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా రంజిత్ రావు మాట్లాడుతూ అధికార పార్టీ ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో విఫలమైందని, ప్రజలు ఇప్పుడు ప్రత్యామ్నాయం కోసం బీజేపీ వైపు చూస్తున్నారని అన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని, కార్యకర్తలు ప్రజలతో కలిసి చురుగ్గా పనిచేయాలని, పార్టీ ఎంపిక చేసిన అభ్యర్థుల గెలుపు కోసం కృషి చేయాలని కోరారు. కార్యకర్తలకు అవసరమైన మానసిక మద్దతు, సహాయ సహకారాలు అందించడానికి రాష్ట్ర పార్టీ సిద్ధంగా ఉందని ఆయన భరోసా ఇచ్చారు. మనం ఈ అవకాశాన్ని అందిపుచ్చుకొని, అభ్యర్థులను గెలిపించి ప్రజల కోసం నిలబడతామని



నిరూపించుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో పీఏసీఎస్ డైరెక్టర్ బూడిద రమేష్, రాష్ట్ర నాయకులు పంజా వెంకటేశ్వర్లు, జిల్లా ఉపాధ్యక్షులు కొండేటి సత్యం, జిల్లా కార్యదర్శి జడ సతీష్, జిల్లా అధికార ప్రతినిధి కుందూరు మహేందర్ రెడ్డి, జిల్లా కిసాన్ మోర్చా కార్యదర్శి సంపత్ రెడ్డి, జిల్లా కౌన్సిల్ మెంబర్ మైస రాము, మాజీ మండల పార్టీ అధ్యక్షులు రాయకురపు కుమారస్వామి, మాజీ జిల్లా ఉపాధ్యక్షులు నాంపల్లి యాకయ్య, మాజీ పట్టణ అధ్యక్షులు పెద్దూరి రాజు, మండల ఉపాధ్యక్షులు శ్రీరాముల సంపత్, మండల ప్రధాన కార్యదర్శులు సాంబయ్య, శ్రీనివాస్, యువ మోర్చా అధ్యక్షులు, మహిళా మోర్చా అధ్యక్షులు, జిల్లా, మండల నాయకులు, శక్తి కేంద్రం ఇంచార్జిలు, బూత్ అధ్యక్షులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# మహిళలకు చీరల పంపిణీ

**వరంగల్ వాయిస్, హనుమకొండ :** గణపతి నవరాత్రి ఉత్సవాలను పురస్కరించుకుని హనుమకొండలోని 31వ డివిజన్, న్యూ శాయంపేటలో మహిళలకు చీరల పంపిణీ కార్యక్రమం జరిగింది. స్థానిక కార్పొరేటర్ మామిండ్ల రాజు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొని సుమారు 2,100 చీరలను మహిళలకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మామిండ్ల రాజు మాట్లాడుతూ అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా మున్సిపల్ కార్మికులు, ఆర్పీలు, అంగన్‌వాడీ కార్యకర్తలకు చీరలు పంపిణీ చేశానని గుర్తు చేశారు. ఇప్పుడు గణపతి నవరాత్రి ఉత్సవాల సందర్భంగా ప్రతి ఆడపడుచుకు చీర ఇవ్వాలనే ఉద్దేశంతో తన సొంత ఖర్చుతో ఈ కార్యక్రమాన్ని చేపట్టానని తెలిపారు. కుంకుమ పూజ, కోలాట నృత్యం వంటి సమూహ పూజల్లో మహిళలందరూ ఒకే డిజైన్, ఒకే రంగు చీరలు ధరించి కులమత భేదం లేకుండా ఒకే కుటుంబంలా కలిసిమెలిసి ఉండే విధంగా ఈ కార్యక్రమం ఏర్పాటు చేశామని ఆయన వివరించారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ మోహన్ రావు, డివిజన్ అధ్యక్షులు సురేందర్, కాంగ్రెస్ సీనియర్ నాయకులు, యూత్ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, ప్రజలు, మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.





# లారీలో ఆగిన డ్రైవర్ గుండె

## స్పందించిన వేలేరు ఎస్ఐ



**వరంగల్ వాయిస్, క్రైం :** నల్గొండ జిల్లా దామెరచర్లకు చెందిన ఓ లారీ డ్రైవర్ గుండెపోటుతో మృతి చెందిన సంఘటన వేలేరు మండలంలో జరిగింది. సమాచారం అందుకున్న పోలీసులు వేగంగా స్పందించి, మృతదేహాన్ని ఆసుపత్రికి తరలించారు. పోలీసుల మానవత్వంపై స్థానికులు ప్రశంసలు కురిపించారు. వివరాల్లోకి వెళితే దామెరచర్ల ప్రాంతానికి చెందిన శ్రీనివాస్ అనే లారీ డ్రైవర్ గురువారం పిసరా గ్రామంలో సిమెంట్ బస్తాలను అన్‌లోడ్ చేసి తిరిగి వస్తున్నాడు. మల్లికూదుర్ల గ్రామం వద్దకు రాగానే గుండెపోటు రావడంతో లారీలోనే మృతి చెందాడు. సమాచారం అందుకున్న వేలేరు ఎస్సై సురేష్ కుమార్ తన సిబ్బందితో కలిసి సంఘటనా స్థలానికి చేరుకున్నారు. లారీలో విగతజీవిగా పడి ఉన్న శ్రీనివాస్ మృతదేహాన్ని స్వయంగా తానే సిబ్బంది, స్థానికులతో కలిసి కిందకు దించారు. అనంతరం ఒక డీసీఎం వ్యాన్‌లో మృతదేహాన్ని ఎక్కించి ఎంజీఎం ఆసుపత్రికి తరలించారు. మృతుడి కుటుంబసభ్యులకు సమాచారం అందించారు. ఈ ఘటనలో ఎస్సై సురేష్ కుమార్ వేగంగా స్పందించడమే కాకుండా, మృతదేహాన్ని తరలించడంలో స్వయంగా పాల్గొనడం పట్ల స్థానికులు, అధికారులు ఆయనను అభినందించారు.

# చందుపట్ల రాజిరెడ్డికి అరుదైన గౌరవం

■ వ్యవసాయ మార్కెట్ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడిగా ఎన్నిక

**వరంగల్ వాయిస్, పరకాల :** పరకాల వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ చందుపట్ల రాజిరెడ్డికి అరుదైన గౌరవం లభించింది. రాష్ట్ర వ్యవసాయ మార్కెట్ కమిటీల నూతన కార్యవర్గ సభ్యుడిగా ఆయన ఎన్నికయ్యారు. తెలంగాణలోని 170 వ్యవసాయ మార్కెట్ కమిటీల చైర్మన్‌ల సమావేశం మేడ్చల్ శివారులో జరిగింది. ఈ సమావేశంలో నూతన రాష్ట్ర కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా ముప్ప గంగారెడ్డి (నిజామాబాద్), గౌరవ అధ్యక్షులుగా చిలుక మధుసూదన్ రెడ్డి (గడ్డి అన్నారం), ప్రధాన కార్యదర్శిగా నరసింహ యాదవ్ (మేడ్చల్), ఉపాధ్యక్షుడిగా ఆనందరావు పటేల్ (భైంసా), ముఖ్య సలహాదారులుగా గంట సంజీవరెడ్డి (కేసముద్రం), రూప్లనాయక్ (ధర్మారం), పొట్టూరి మహేష్ (చొప్పదండి), తిరుమల తిరుపతి (గోపాలరావుపేట), డైరెక్టర్లుగా చందుపట్ల రాజిరెడ్డి (పరకాల), సుధాకర్ రెడ్డి (రాయకోడు),



ఝాన్సీ రాణి (కమలాపూర్), అంజిరెడ్డి (కోరుట్ల), వెంకటయ్య (చౌటుప్పల్), హనుమంతరావు (ఖమ్మం), అనిత (మహబూబ్ నగర్), లక్ష్మి (హైదరాబాద్) లు ఎన్నికయ్యారు. ఈ ఎన్నికతో వ్యవసాయ మార్కెట్ల అభివృద్ధిలో పరకాల మార్కెట్ కమిటీ చైర్మన్ రాజిరెడ్డికి కీలక పాత్ర లభించనుంది.

# ప్రభుత్వ ఉపాధ్యాయులకు అన్యాయం



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** జిల్లాలో ఉత్తమ ఉపాధ్యాయ అవార్డుల ఎంపికలో ప్రభుత్వ పాఠశాలల ఉపాధ్యాయులకు అన్యాయం జరుగుతోందని ప్రభుత్వ ఉపాధ్యాయ సంఘం (జీటీఏ) జిల్లా అధ్యక్షుడు గుజ్జ వెంకటేశం ఒక ప్రకటనలో ఆవేదన వ్యక్తం చేశారు. గత రెండు సంవత్సరాలుగా ఇదే పరిస్థితి కొనసాగుతోందని, అర్హులైన ప్రభుత్వ ఉపాధ్యాయులను కాదని, కేవలం జిల్లా పరిషత్ పాఠశాలల నుంచి మాత్రమే ఉత్తమ ఉపాధ్యాయులను ఎంపిక చేస్తున్నారని ఆయన తెలిపారు. ఈ అన్యాయంపై ఉమ్మడి జిల్లా జీటీఏ నాయకత్వంతో కలిసి హనుమకొండ డీఈఓకి వినతిపత్రం కూడా సమర్పించినట్లు వెంకటేశం తెలియజేశారు. వెంటనే జరిగిన తప్పిదాన్ని సరిదిద్ది, ప్రభుత్వ యాజమాన్యంలోని సమర్థులైన ఉపాధ్యాయులను జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులకు ఎంపిక చేయాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ విషయంలో న్యాయం జరిగే వరకు తమ పోరాటం కొనసాగుతుందని ఆయన స్పష్టం చేశారు.

# టైలర్ స్ట్రీట్ వినాయకునికి నిత్య పూజలు



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** టైలర్ స్ట్రీట్‌లో కొలువుదీరిన గణపతి నవరాత్రి ఉత్సవాలు ఘనంగా సాగుతున్నాయి. గురువారం నవరాత్రి చివరి రోజు కావడంతో భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా హనుమకొండ జిల్లా స్వర్ణకార సంఘం ఆహ్వానం మేరకు తెలంగాణ రాష్ట్ర విశ్వబ్రాహ్మణ విశ్వకర్మ మాతృ సంఘం నాయకులు పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. వారికి నిర్వాహకులు తీర్థ ప్రసాదాలు అందజేసి, వేద పండితుల ఆశీర్వచనంతో సత్కరించారు. భక్తులకు రోజంతా తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో హనుమకొండ జిల్లా స్వర్ణకార సంఘం అధ్యక్షుడు పానుగంటి శ్రీధర్, నాయకులు పెందోట చక్రపాణి, చొల్లేటి కృష్ణమాచార్యులు, డాక్టర్ పొలాస రమేష్, డాక్టర్ పొడిచెట్టి విష్ణువర్ధన్, కటుకోజ్వల సత్యనారాయణ, కొత్తగట్టు బ్రహ్మం, సిద్ధోజు వీరన్న, మహారాజా భరత్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రతాప్ నగర్‌లో అన్నదానం



**వరంగల్ వాయిస్, కరీమాబాద్ :** ప్రతి వ్యక్తి భక్తి భావం కలిగి ఉన్నప్పుడే గణపతి దేవుని అనుగ్రహం లభిస్తుందని 40వ డివిజన్ కార్పొరేటర్ మరుపల్ల రవి అన్నారు. గురువారం ఉర్సు ప్రతాప్ నగర్‌లోని శ్రీ లక్ష్మి గణపతి యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మరుపల్ల రవి మాట్లాడుతూ నేటి యువత సమాజ సేవలో చురుగ్గా పాల్గొని, సన్మార్గంలో నడవాలని, అలాగే దేశభక్తిని పెంపొందించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో యూత్ అసోసియేషన్ ప్రతినిధులు బూర రాజు, బూర శివ సాయి, బూర రేవంత్, అడ్డగట్ల వరుణ్, కోదాటి అరుణ్, బూర శివ, మోర రూపా రాణి, మోర సురేష్, సిరిమల్ల రక్షిత తదితరులు పాల్గొన్నారు.

# రెండు నెలల వేతనాలు విడుదల చేయాలి

**వరంగల్ వాయిస్, మెదక్ :** నేషనల్ హెల్త్ మిషన్ (ఎన్‌హెచ్‌ఎం)లో పనిచేస్తున్న ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులకు పెండింగ్‌లో ఉన్న రెండు నెలల వేతనాలను తక్షణమే విడుదల చేయాలని ఉద్యోగులు డిమాండ్ చేశారు. గురువారం రోజున ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగులు డిపిఓ కోట ఆధ్వర్యంలో డీఎంహెచ్ఓ డాక్టర్ శ్రీరామ్‌కు వినతిపత్రం సమర్పించారు. జూలై, ఆగస్టు నెలల వేతనాలను వెంటనే చెల్లించాలని, అలాగే ప్రతి నెల 5వ తేదీన జీతాలు అందేలా చర్యలు తీసుకోవాలని ఉద్యోగులు డాక్టర్ శ్రీరామ్‌ను కోరారు. తమ సమస్యలను వెంటనే పరిష్కరించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో మెదక్ జిల్లా డీఎంహెచ్ఓ కార్యాలయంలోని డిస్టిక్ ప్రోగ్రాం ఆఫీసర్ కోట, అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ రమేష్, డి.డి.ఎం. స్వాతి, డేటా ఎంట్రీ ఆపరేటర్ సంగీత తదితరులు పాల్గొన్నారు.

## తౌటం ఝాన్సీ రవీందర్ కు సత్కారం



**వరంగల్ వాయిస్, హైదరాబాద్:** శ్రీ రామానుజం ఫౌండేషన్ (ఎస్ఆర్ఎఫ్) ఛైర్మన్ తుమ్మ అమరేష్ ఆధ్వర్యంలో గురుబ్రహ్మ అవార్డుల ప్రదానోత్సవం హైదరాబాద్‌లోని తెలుగు విశ్వవిద్యాలయం ఆడిటోరియంలో జరిగింది. తెలంగాణ రాష్ట్రంలోని ఉత్తమ ఉపాధ్యాయులను ఎంపిక చేసి ఈ అవార్డులను అందజేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా లోక్ సత్తా అధినేత, రిటైర్డ్ ఐఏఎస్ అధికారి డా. జయప్రకాష్ నారాయణ గారు హాజరయ్యారు. వారితో పాటు కమలాపూర్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్ పర్సన్ తౌటం ఝాన్సీ రాణి రవీందర్ కూడా పాల్గొన్నారు. ఈ సందర్భంగా డా. జయప్రకాష్ నారాయణ తౌటం ఝాన్సీ రాణి రవీందర్‌ను సత్కరించారు. ఉత్తమ ఉపాధ్యాయులను సన్మానించడం ద్వారా గురువులకు ఉన్న ప్రాముఖ్యతను ఈ కార్యక్రమం చాటి చెప్పింది.

## అప్పరాజు రాజు ఆధ్వర్యంలో అన్నదానం



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** శ్రీ సిద్ధి వినాయక భక్త మండలి అధ్యక్షుడు అప్పరాజు రాజు ఆధ్వర్యంలో జరుగుతున్న నవరాత్రి ఉత్సవాలలో భాగంగా గురువారం రోజున మహా అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి నగర ప్రముఖులు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ప్రముఖ సామాజికవేత్త లయన్ డాక్టర్ తాళ్ల రవి, ప్రభుత్వ న్యాయవాది కావిటి మురళీధర రావు ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా విచ్చేసి గణపతి స్వామి ఆశీర్వచనం తీసుకున్నారు. అనంతరం అన్నప్రసాద కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, వినాయకుని ఆశీస్సులతో ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో డివిజన్ పెద్దలు డాక్టర్ రాజేంద్రప్రసాద్, తెలంగాణ ఉద్యమకారుడు రాచర్ల రాము, మంతెన రాజేష్, భక్త మండలి సభ్యులు పెండెం నాగేశ్వరరావు, జక్కోజు వెంకటేశ్వర్లు, పడిశాల రాజు, పరిశరాం, అఖిల్, విజయ్, రాజేష్, నవనీత్, విగ్నేష్, చరణ్, విద్వేష్, లడ్డు, చరణ్, స్థానిక మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## రైతాంగానికి కాంగ్రెస్ సర్కార్ పెద్దపీట

### మాజీ జడ్పీటీసీ గుడి వంశీధర్ రెడ్డి



**వరంగల్ వాయిస్, రఘునాథపల్లి :** తెలంగాణలో రైతాంగానికి రేవంత్ రెడ్డి ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని, ఇచ్చిన మాటను నిలబెట్టుకుంటుందని లింగాల ఘణపురం మాజీ జడ్పీటీసీ, కాంగ్రెస్ రాష్ట్ర నాయకులు గుడి వంశీధర్ రెడ్డి అన్నారు. గురువారం ఆయన మీడియాతో మాట్లాడుతూ ఈ విషయం తెలిపారు. గత 20 నెలల కాలంలోనే కాంగ్రెస్ ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టి విజయవంతంగా అమలు చేసిందని ఆయన పేర్కొన్నారు. స్టేషన్ ఘణపూర్ నియోజకవర్గాన్ని అభివృద్ధిలో అగ్రస్థానంలో నిలిపేందుకు ఎమ్మెల్యే కడియం శ్రీహరి కృషి చేస్తున్నారని తెలిపారు. దేవాదుల ప్రాజెక్టు సృష్టికర్త అయిన కడియం శ్రీహరి నాయకత్వంలో రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో అత్యధిక స్థానాలు గెలిచేందుకు ప్రతి కార్యకర్త సైనికుడిలా పనిచేయాలని వంశీధర్ రెడ్డి పిలుపునిచ్చారు. రేపు, లింగాల ఘణపురం మండలం నవాబుపేట గ్రామంలో రైతులను ఆదుకునేందుకు కెనాల్ కాలువ ద్వారా నీటిని విడుదల చేయనున్నారు. ఈ కార్యక్రమానికి స్టేషన్ ఘనపూర్, పాలకుర్తి, ఆలేరు ఎమ్మెల్యేలు, వరంగల్ పార్లమెంటు సభ్యురాలు కడియం కావ్య హాజరవుతారని వంశీధర్ రెడ్డి తెలిపారు.

# బీఆర్ఎస్‌ది డ్రామా రాజకీయం

### ◆ విమర్శించిన కాంగ్రెస్ నాయకులు



**వరంగల్ వాయిస్, శాయంపేట :** గత ప్రభుత్వంలో 'వరి వేస్తే ఉరే' అన్న బీఆర్ఎస్ నాయకులు ఇప్పుడు రైతు సమస్యలపై మాట్లాడటం సిగ్గుచేటని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు దూదిపాల బుచ్చిరెడ్డి విమర్శించారు. గురువారం మండల నాయకులతో కలిసి ఆయన విలేకరులతో మాట్లాడారు. నానో యూరియా వాడకం వల్ల అంతర్జాతీయంగా యూరియా కొరత ఏర్పడిందని, దీన్ని బీఆర్ఎస్ రాజకీయ లబ్ధి కోసం వాడుకోవడం సరికాదని మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణా రెడ్డికి హితవు పలికారు. గతంలో బీఆర్ఎస్ పాలనలో తాలు, తేమ పేరుతో రైతులను దోచుకోవడమే కాకుండా, అక్రమ కేసులు పెట్టించిన చరిత్ర ఆ పార్టీదేనని మండిపడ్డారు. శాయంపేట పీఏసీఎస్‌లో లక్షల్లో అవినీతి జరిగిందని అధికారులు నోటీసులు ఇచ్చారని, రైతు సంక్షేమంపై నిజంగా చిత్తశుద్ధి ఉంటే ఆ అవినీతి సొమ్మును రికవరీ చేయించి చూపించాలని సవాల్ విసిరారు. ధర్నాల పేరుతో డ్రామాలు చేస్తే సహించేది లేదని బుచ్చిరెడ్డి హెచ్చరించారు. రైతుల సమస్యల పరిష్కారానికి భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు అహర్నిశలు కృషి చేస్తున్నారని తెలిపారు. గత సీజన్‌లో వెయ్యి టన్నుల యూరియా పంపిణీ చేస్తే, ఈ సీజన్‌లో ఇప్పటికే సుమారు 1,300 టన్నులు పంపిణీ జరిగిందని వివరించారు. పెద్ద రైతులు యూరియా నిల్వ చేయడం వల్ల చిన్న రైతులు ఇబ్బందులు పడుతున్నారని, నిల్వ చేయకుండా సహకరించాలని కోరారు. ప్రభుత్వం రైతు రుణమాఫీ చేసి, సన్న వడ్లకు బోనస్ కూడా ఇచ్చిందని గుర్తు చేశారు. తమ ఉనికిని చాటుకోవడానికి బీఆర్ఎస్ నాయకులు చెప్పే అబద్ధాలను నమ్మవద్దని, ప్రభుత్వం రైతులకు అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండల నాయకులు చల్లా చక్రపాణి, మారేపల్లి రవీందర్, చిందం రవి, వైనాల కుమారస్వామి, నిమ్మల రమేష్, అబ్బు ప్రకాష్ రెడ్డి, శానం కుమారస్వామి, రాజ్‌కుమార్, రాజు, మార్కండేయ, శంకర్, రమేష్, చంద్రయ్య, బాసని రవి, భాస్కర్, శంకరాచారి, కటయ్య, సాదు నాగరాజు, రాము, కుమారస్వామి, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

## 5న రాష్ట్రవ్యాప్తంగా రేషన్ దుకాణాల బంద్



**వరంగల్ వాయిస్, హసన్ పర్తి :** కాంగ్రెస్ ప్రభుత్వం తమ ఎన్నికల హామీలను నెరవేర్చాలని డిమాండ్ చేస్తూ శుక్రవారం ఒక్కరోజు రాష్ట్రవ్యాప్తంగా రేషన్ దుకాణాల బంద్‌కు పిలుపునిచ్చినట్లు జిల్లా ప్రధాన కార్యదర్శి చిలగాని మోహన్ తెలిపారు. డీలర్ల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని ఆయన డిమాండ్ చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం తమ మానిఫెస్టోలో హామీ ఇచ్చినట్లుగా కనీస గౌరవ వేతనం రూ. 5,000/- మరియు కమీషన్‌ను పెంచి అందించాలి. ప్రభుత్వం ఏర్పడి 21 నెలలు గడుస్తున్నా తమ సమస్యలను పట్టించుకోవడం లేదని మోహన్ ఆవేదన వ్యక్తం చేశారు. గత ఏప్రిల్ నుంచి ఆగస్టు వరకు ఐదు నెలల కాలానికి సంబంధించిన కేంద్ర ప్రభుత్వ బియ్యం కమీషన్ డబ్బులను వెంటనే విడుదల చేయాలి. కేంద్ర, రాష్ట్ర కమీషన్‌లను వేర్వేరుగా కాకుండా ఒకే కమీషన్‌గా చేసి, ఏ నెల కమీషన్ ఆ నెలలోనే చెల్లించాలి. రేషన్ షాపులను 'మినీ సూపర్ మార్కెట్లు'గా గుర్తించి మరిన్ని నిత్యావసర వస్తువులను అందుబాటులోకి తేవాలి. రేషన్ డీలర్ల కుటుంబాలకు హెల్త్ కార్డులు, కరోనాతో మరణించిన డీలర్ల కుటుంబాలకు రూ. 20 లక్షల ఎక్స్‌గ్రేషియా అందించాలి. రేషన్ డీలర్లలో అర్హులైన వారికి శాఖాపరమైన పదోన్నతులు కల్పించాలి. హైదరాబాద్‌లో 'రేషన్ భవన్' నిర్మాణానికి వెయ్యి గజాల స్థలం కేటాయించాలి. తమ సమస్యలను ప్రభుత్వానికి తెలియజేయడం కోసం ఈ శాంతియుత బంద్‌కు పిలుపునిచ్చినట్లు చిలగాని మోహన్ స్పష్టం చేశారు.

## పోగొట్టుకున్న డబ్బులు అందజేత



**వరంగల్ వాయిస్, సుబేదారి :** నిజాయితీకి నిలువుటద్దంలా నిలిచిన దుంపేటి రాము అనే యువకుడు పోగొట్టుకున్న పది వేల రూపాయలను తిరిగి వాటి యజమానికి అందజేశారు. ఈ సంఘటన సుబేదారి పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. నాలుగు రోజుల క్రితం హనుమకొండలోని ఇందిరానగర్‌లో ఉన్న ఎస్‌బీఐ ఏటీఎం వద్ద గుండాల శ్రీనివాసరావు అనే వ్యక్తి పది వేల రూపాయలు విత్‌డ్రా చేసుకుని వెళ్తున్నప్పుడు, ఆ డబ్బులు అనుకోకుండా రోడ్డుపై పడిపోయాయి. అదే సమయంలో అటుగా వెళ్తున్న దుంపేటి రాము వాటిని గమనించారు. ఎవరో పోగొట్టుకున్నారని భావించి వెంటనే సుబేదారి ఇన్‌స్పెక్టర్ ఎం.రంజిత్‌కుమార్‌కు సమాచారం అందించారు. ఇన్‌స్పెక్టర్ ఆదేశాల మేరకు క్రైమ్ కానిస్టేబుల్ మారేపల్లి ప్రభాకర్ ఏటీఎం వద్ద ఉన్న సీసీ కెమెరాలను పరిశీలించి, డబ్బులు గుండాల శ్రీనివాసరావుకు చెందినవని నిర్ధారించారు. అనంతరం ఇన్‌స్పెక్టర్ రంజిత్‌కుమార్ సమక్షంలో దొరికిన రూ. 10,000లను దుంపేటి రాము చేతుల మీదుగా శ్రీనివాసరావుకు తిరిగి అందజేశారు. ఈ సందర్భంగా, నిజాయితీగా డబ్బులను అప్పగించిన దుంపేటి రామును, సీసీ కెమెరాలను పరిశీలించి డబ్బుల యజమానిని గుర్తించిన కానిస్టేబుల్ ప్రభాకర్‌ను ఇన్‌స్పెక్టర్ ఎం. రంజిత్‌కుమార్ అభినందించారు.

## అక్కంపేటలో ఉచిత వైద్య శిబిరం



**వరంగల్ వాయిస్, ఆత్మకూరు :** జిల్లా వైద్య ఆరోగ్య శాఖ ఆదేశాల మేరకు ఆత్మకూర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో బుధవారం మండలంలోని అక్కంపేట గ్రామంలో ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ శిబిరం పోచమ్మ సెంటర్ వద్ద జరిగింది. వైద్య శిబిరంలో 76 మంది గ్రామస్తులకు ఆరోగ్య పరీక్షలు నిర్వహించారు. ఈ పరీక్షల్లో 20 మందికి బీపీ, 12 మందికి షుగర్, 26 మందికి ఇతర వ్యాధులు ఉన్నట్లు గుర్తించారు. వారికి ఉచితంగా మందులను పంపిణీ చేశారు. జ్వరంతో బాధపడుతున్న 11 మంది నుంచి రక్త నమూనాలను సేకరించి, వారికి కూడా మందులు అందజేశారు. ఈ సందర్భంగా వైద్యాధికారి డాక్టర్ స్వాతి మాట్లాడుతూ, గ్రామస్తులు సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ నర్సింగరావు, అనిల్ కుమార్, హెల్త్ సూపర్వైజర్లు, గ్రామ పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

## ఆశా వర్కర్లకు రూ. 18 వేలు ఫిక్స్‌డ్ వేతనం ఇవ్వాలి





**వరంగల్ వాయిస్, శాయంపేట :** ఆశా వర్కర్లకు నెలకు రూ. 18,000 ఫిక్స్‌డ్ వేతనం ఇవ్వాలని సీఐటీయూ హనుమకొండ జిల్లా కార్యదర్శి రాగుల రమేష్ డిమాండ్ చేశారు. గురువారం శాయంపేట ప్రభుత్వ ఆసుపత్రిలో జరిగిన ఆశా వర్కర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ సమావేశానికి మామిడి రమాదేవి అధ్యక్షత వహించారు. ఆశా వర్కర్లకు ప్రభుత్వం ఇచ్చిన హామీ ప్రకారం రూ. 18,000 వేతనం, ఈఎస్ఐ, పీఎఫ్ సౌకర్యం కల్పించాలని రమేష్ డిమాండ్ చేశారు. ఏఎన్‌సీ టార్గెట్‌లను రద్దు చేయాలని, పారితోషికంలో లేని పనులను ఆశా వర్కర్లతో చేయించకూడదని ఆయన ప్రభుత్వాన్ని కోరారు. కేంద్ర ప్రభుత్వం పెంచిన పారితోషికాలను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం ఆశా వర్కర్లతో వెట్టి చాకిరి చేయిస్తూ వారి శ్రమను దోపిడీ చేస్తోందని రమేష్ మండిపడ్డారు. నెలనెలా వేతనాలు సక్రమంగా అందించడంలో ప్రభుత్వం విఫలమైందని ఆయన విమర్శించారు. ఆశా వర్కర్లపై పని భారాన్ని తగ్గించాలని ఆయన కోరారు. ఈ సమావేశంలో శాయంపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని 37 మంది ఆశా వర్కర్లు బీఆర్‌టీయూ నుంచి సీఐటీయూలో చేరారు. ఈ కార్యక్రమంలో మారపెల్లి కవిత, కోగిలి సృజన, పెంబర్తి నీల, అంకేశ్వరపు రజిత, కోగిలి స్రవంతి తదితరులు పాల్గొన్నారు.

# ఘాటిలో.. అనుష్క పవర్‌ఫుల్ రోల్

## గ్లింప్స్‌ను పంచుకున్న ప్రభాస్

అనుష్క శెట్టి ప్రధాన పాత్రలో దర్శకుడు క్రిష్ తెరకెక్కించిన సినిమా 'ఘాటి' ఈ యాక్షన్ క్రైమ్ డ్రామా ఈనెల 5న శుక్రవారం ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈనేపథ్యంలో తాజాగా రిలీజ్ గ్లింప్స్ విడుదలైంది. అగ్రకథానాయకుడు ప్రభాస్ దీన్ని పంచుకున్నారు. 'వాళ్లు ఊరుకోరు, వీళ్లు ఊరుకోరు, అంటే నేను ఊరుకోను..' అంటూ సీరియస్ డైలాగుతో పవర్‌ఫుల్ పాత్రలో అనుష్క కనిపించారు. అనుష్క లీడ్ రోల్‌లో క్రిష్ జాగర్లమూడి దర్శకత్వంలో ఒడిశా నేపథ్యంలో యాక్షన్ థ్రిల్లర్‌గా రూపొందిన 'ఘాటి' సినిమా ప్రేక్షకులకు సరికొత్త అనుభూతి ఇవ్వడానికి సిద్ధంగా ఉంది. చాలా గ్యాప్ తర్వాత అనుష్క నటిస్తున్న సినిమా కావడంతో.. మొదటి నుంచి 'ఘాటి'పై మంచి అంచనాలు నెలకొన్నాయి. ఇప్పటికే రిలీజ్ అయిన సాంగ్స్, టీ–జర్, –ట్రైలర్.. అనుష్క చేయబోయే విధ్వంసానికి శాంపిల్‌గా ఉండగా.. లే–టె–స్ట్‌గా ప్రభాస్ చేతుల మీదుగా విడుదల అయిన రిలీజ్ –ట్రైలర్ అంచనాలను నెక్స్ట్ లెవల్‌కి తీసుకెళ్లేలా ఉంది. ఈ రిలీజ్ –ట్రైలర్‌ను సోషల్ మీడియా ఖాతా ద్వారా రిలీజ్ చేశాడు డార్లింగ్. ఇక ఈ రిలీజ్ ట్రైలర్ మాత్రం అదిరిపోయిందనే చెప్పాలి. అనుష్క చేయబోయే ఊచకోతకు గూస్‌బంప్స్ గ్యారెంటీ అనేలా ఉంది. స్వీటీ– చేసిన యాక్షన్ సినిమాకే హైలెట్‌గా నిలిచేలా ఉంది. సూపర్బ్ బ్యాక్ గ్రౌండ్ స్కోర్‌తో సాగిన రిలీజ్ –ట్రైలర్‌లో అనుష్క పర్ఫామెన్స్ మామూలుగా లేదు. శీలావతిగా ఆమె చేసిన పోరాట సన్నివేశాలు –ట్రైలర్‌లో హైలెట్‌గా నిలిచాయి. ఈసారి దర్శకుడు క్రిష్ ఊహించని యాక్షన్ ఎలిమెంట్స్‌తో అనుష్కతో ఊచకోత చేయించినట్టు–గా ఉంది. దీంతో.. ఘాటి రాక కోసం ఎదురు చూస్తున్నారు అభిమానులు. సెప్టెంబర్ 5న ఈ చిత్రం థియేటర్లోకి రానుండగా.. ఇంకొన్ని గంటల్లో తెరపై శీలావతి ఊచకోతను చూడబోతున్నాం. ఈ సినిమాలో అనుష్క పాత్ర అరుంధతికి మించి ఉంటు–ందనే టాక్ అయితే గట్టిగా వినిపిస్తోంది. గతంలో క్రిష్ దర్శకత్వంలో వేదం అనే సినిమాలో నటించారు అనుష్క. ఆ సినిమాలో సరోజ పాత్ర లాగే, ఇప్పుడు 'ఘాటి'లో శీలావతి పాత్ర ప్రత్యేకంగా ఎప్పటికి ప్రేక్షకులకు గుర్తుండిపోయేలా ఉంటు–ందనే అంచనాలున్నాయి.




# రామ్.. ఆంధ్రా కింగ్ తాలూకా

టాలీవుడ్ యాక్టర్ రామ్ పోతినేని హీరోగా నటిస్తోన్నతాజా ప్రాజెక్ట్ 'ఆంధ్ర కింగ్ తాలూకా'. మైత్రీ మూవీ మేకర్స్ తెరకెక్కిస్తున్న ఈ మూవీకి 'మిస్‌శెట్టి మిస్టర్ పొలిశెట్టి' ఫేం మహేష్‌బాబు దర్శకత్వం వహిస్తున్నాడు. భాగ్యశ్రీ బోర్సే హీరోయిన్‌గా నటిస్తోంది. కన్నడ స్టార్ హీరో ఉపేంద్ర ఈ మూవీలో కీలక పాత్రలో నటిస్తున్నారు. ఇప్పటికే విడుదల చేసిన –టైటిల్ గ్లింప్స్ నెట్టింట వైరల్ అవుతూ సినిమాపై సూపర్ హైప్ క్రియేట్ చేస్తోంది. ఈ చిత్రాన్ని సెప్టెంబర్ 28న విడుదల చేస్తున్నట్టు– ఇప్పటికే ప్రకటించారు. కాగా ఈ మూవీ నుంచి సెకండ్ సింగిల్ పప్పీ షేమ్ లాంచ్ అప్‌డేట్ అందించారు. ఈ పాటను సెప్టెంబర్ 8న లాంచ్ చేయబోతున్నారు.



# జాన్వీని నేను అలా అనలేదు..

### □ విమర్శలపై క్లారిటీ ఇచ్చిన పవిత్రామీనన్




జాన్వీ కపూర్ నటించిన లేటెస్ట్ రొమాంటిక్ కామెడీ మూవీ 'పరమ్ సుందరి'. ఈ సినిమాలో జాన్వీని తీసుకోవడంపై పలు విమర్శలు ఎదురైన సంగతి తెలిసిందే. ఉత్తరాదికి చెందిన ఆమెను మలయాళ యువతిగా చూపించడంపై పలువురు అసంతృప్తి వ్యక్తంచేశారు. కేరళ బ్యాక్‌డ్రాప్ చిత్రంలో నటించేందుకు మలయాళ హీరోయిన్స్ లేరా? అంటూ గాయని పవిత్రా మేనన్ ఓ వీడియో విడుదల చేయగా అది చర్చనీయాంశమైంది. తాజాగా ఆమె దీనిపై స్పష్టతనిచ్చారు. నేను నటిని కాదు.. గాయనిని.. జాన్వీకి వ్యతిరేకంగా ఒక మలయాళ నటి విమర్శలు చేసింది అనే వార్తల్లో నిజం లేదు. నేను చెప్పింది పూర్తిగా భిన్నమైన అంశం. ఇది వృత్తిపరమైన అసూయ కాదు. నిజాయితీగా చెప్పాలంటే నేను వేరొకరి నోటి దగ్గర తిండిని లాగేసుకొనే ప్రయత్నం చేయలేదు. నేను భాష గురించి మాత్రమే మాట్లాడాను. మరొక ప్రాంతానికి చెందిన వారు మలయాళం సరిగ్గా మాట్లాడలేరని చెప్పానంతే. జాన్వీ ఆ పాత్రకు న్యాయం చేసింది. నేను ఆమెను రెండుసార్లు కలిశాను. ఆమె వ్యక్తిగతంగానూ తెలుసు. సినీ ఇండస్ట్రీలో ఏ ప్రాంతం నుంచైనా నటీనటులను ఎంపిక చేసుకోవచ్చు. కాకపోతే ఇతర ప్రాంతాల నుంచి తీసుకున్నప్పుడు వారికి మన భాషను నేర్పించడానికి కోచ్‌ను నియమించుకోవాలి. అలా నియమించడం వల్ల నష్టం లేదు కదా..' అని చెప్పారు.

# అల్లరి నరేశ్.. ఆల్కహాల్

## టీజర్ విడుదల

అల్లరి నరేశ్ నటిస్తున్న తాజా సినిమా ఆల్కహాల్ . రుహానీ శర్మ కథానాయిక. మెహర్ తేజ్ దర్శకత్వంలో ఇది రూపొందుతోంది. వచ్చే ఏడాది జనవరి 1న ఈ సినిమా ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ నేపథ్యంలో తాజాగా దీని టీజర్‌ను చిత్రబృందం విడుదల చేసింది. సత్య, నిహారిక ఎన్‌ఎమ్ కీలకపాత్రల్లో కనిపించనున్నారు. ఈ సినిమా ప్రేక్షకులను కట్టిపడేసే, ఒక గొప్ప సినిమాటిక్ అనుభవాన్ని ఇస్తుందనే నమ్మకాన్ని టీజర్ కలిగించింది. 'ఆల్కహాల్' చిత్రం ఒక ఉత్కంఠభరితమైన థ్రిల్లర్ డ్రామా అని తెలిపేలా టీ–జర్‌ను అద్భుతంగా రూపొందించారు. మద్యం కథానాయకుడి జీవితాన్ని ఎలా ప్రభావితం చేస్తుందో, తాగడానికి ముందు మరియు తాగిన తరువాత అతని ప్రవర్తన, మరియు దాని చుట్టూ జరిగే సంఘటనల సమాహారాన్ని ఈ టీ–జర్ సూచిస్తుంది. హాస్యం మాత్రమే కాకుండా, నవరసాలను అద్భుతంగా పలికించగల నటు–డిగా పేరుగాంచిన అల్లరి నరేష్, 'ఆల్కహాల్' రూపంలో మరో వైవిధ్యమైన చిత్రాన్ని అందించబోతున్నారు. ఇందులో సత్య సరికొత్త అవతారంలో కనిపిస్తున్నారు. ఈ సినిమాతో నరేష్, పూర్తిగా కొత్త మార్గంలో అడుగు పెడుతున్నట్లు– కనిపిస్తోంది. ఇది ప్రేక్షకులలో కాస్త క్యూరియాసిటీ–ని పెంచుతుందనే చెప్పాలి. సుహాస్ నటించిన 'ఫ్యామిలీ డ్రామా'తో విమర్శకుల ప్రశంసలతో పాటు–, ప్రేక్షకుల మెప్పు పొందిన దర్శకుడు మెహర్ తేజ్ ఈ చిత్రానికి దర్శకత్వం వహిస్తున్నారు.



# శోభా యాత్రకు పటిష్ట బందోబస్తు

- విధుల్లో 2,100 సిబ్బంది
- డ్రోన్లు, సీసీ కెమెరాలతో పర్యవేక్షణ
- వరంగల్ పోలీస్ కమిషనర్ సన్‌ప్రీత్ సింగ్



**వరంగల్ వాయిస్, క్రైం :** గణేష్ నిమజ్జనోత్సవం సందర్భంగా నిర్వహించనున్న శోభయాత్రలకు పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేసినట్లు వరంగల్ పోలీస్ కమిషనర్ సన్‌ప్రీత్ సింగ్ వెల్లడించారు. గణేష్ నిమజ్జనోత్సవాలను శాంతియుతంగా నిర్వహించేదుకు వరంగల్ పోలీస్ కమిషనరేటు పరిధిలోని సెంట్రల్, ఈస్ట్, వెస్ట్ జోన్ల పరిధిలో అన్ని ఏర్పాట్లు పూర్తిచేశామన్నారు. ఇందుకు గాను నలుగురు డీసీపీలు, ఇద్దరు అదనపు డీసీపీలు, 15 మంది ఏసీపీలు, 53 మంది ఇన్ స్పెక్టర్లు, 70 మంది ఎస్సైలతో పాటు ఏఎఎస్సై, హెడ్ కానిస్టేబుళ్లు, కానిస్టేబుళ్లు, హోంగార్డ్స్ తో కలుపుకొని మొత్తం 2,100 మంది పోలీసులు బందోబస్తు విధులు నిర్వహిస్తున్నారన్నారు. ఇందులో ప్రత్యేకించి ట్రై సిటీ పరిధిలోనే 1,600 మంది బందోబస్తు విధులు నిర్వహిస్తున్నారన్నారు. శోభయాత్రతో పాటు నిమజ్జనోత్సవం సజావుగా సాగేందుకు అధిక సంఖ్యలో సీసీ కెమెరాలు, డ్రోన్ కెమెరాలను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. వీటి ద్వారా అధికారులు ఎప్పటికప్పుడు పర్యవేక్షించడం జరుగుతుందన్నారు. గణేష్ శోభయాత్ర నిర్వహించే మార్గంలో ఎలాంటి ట్రాఫిక్ అంతరాయం కలగకుండా శుక్రవారం మధ్యాహ్నం నుంచి ట్రాఫిక్ మళ్ళింపు కొనసాగించడంతో పాటు అన్ని ముఖ్యమైన జంక్షన్లు, ముఖ్యమైన మార్గాల్లో ట్రాఫిక్ సిబ్బందిని నియమించడం జరిగిందన్నారు.

## నిబంధనలు పాటించాల్సిందే..

శోభయాత్రలో ప్రతి ఒక్కరూ పోలీసుల సూచనలు పాటించాల్సిందేనని పోలీస్ కమిషనర్ సన్‌ప్రీత్ సింగ్ పేర్కొన్నారు. నిమజ్జన ఊరేగింపులో శాంతియుత వాతావరణం కొనసాగించాలన్నారు. నిర్వాహకులు నిమజ్జనం కోసం వాహనాలను ముందుగానే ఏర్పాటు చేసుకోవాలని, ఆడియో సిస్టమ్స్ నిర్ణీత స్థాయిలో ఉపయోగించాలని, డీజేలు పూర్తిగా నిషేధమన్నారు. వాహనాలను ట్రాఫిక్ కు అంతరాయం కలగకుండా నడపాలని, ప్రార్థన మందిరాల వద్ద నిలపరాదని, శోభయాత్ర వేళ బాణాసంచా కాల్చడం నిషేధమన్నారు. శోభయాత్ర కొనసాగే మార్గంలో విద్యుత్తు తీగలను గమనిస్తూ యాత్ర కోనసాగాలని, ముఖ్యంగా నిమజ్జనం ప్రాంతానికి చిన్నపిల్లలను తీసుక వెళ్ళకుండా జాగ్రత్త పడాలన్నారు. అనుమానస్పద వ్యక్తులు, వస్తువులు కనిపించినప్పుడు వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు. పుకార్లు నమ్మరాదన్నారు. మద్యం సేవించి ఊరేగింపులో పాల్గొనరాదన్నారు. అలాంటి వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అత్యవసర సమయంలో 100 కి డయల్ చేయాలన్నారు.




# సామల స్వరూపకు గురుబ్రహ్మ అవార్డు

- జయప్రకాశ్ నారాయణ్ చేతుల మీదుగా ప్రదానం
- అభినందించిన వాణి విద్యానికేతన్ స్టాఫ్

**వరంగల్ వాయిస్, కరీమాబాద్ :** అండర్ రైల్వే గేట్ ప్రాంతం శిరంగి రాజా రాం తోటలోని వాణి విద్యానికేతన్ హైస్కూల్ ప్రిన్సిపాల్ సామల స్వరూపకు గురుబ్రహ్మ అవార్డు లభించింది. టీచర్స్ డే సందర్భంగా శ్రీనివాస రామానుజన్ ఫౌండేషన్ (ఎస్ఆర్ఎఫ్) ఆధ్వర్యంలో బుధవారం హైదరాబాద్ లోని శ్రీ పొట్టి శ్రీరాములు ఆడిటోరియంలో ఉత్తమ ప్రిన్సిపాల్స్, కరస్పాండెంట్లకు లోక్ సత్తా అధ్యక్షులు జయప్రకాశ్ నారాయణ, ఎస్ఆర్ఎఫ్ మేనేజింగ్ డైరెక్టర్ తుమ్మ అమరేష్ చేతుల మీదుగా బహుమతులు ప్రధానం చేశారు. గురుబ్రహ్మ అవార్డు పొందిన సామల స్వరూపను పాఠశాల కరస్పాండెంట్ సామల సుధాకర్, డైరెక్టర్ సామల మురళీకృష్ణ, ఇతర సిబ్బంది శుభాకాంక్షలు తెలుపగా, విద్యార్థులు అభినందించారు.



# అభివృద్ధిని పరుగులు పెట్టించాలి

- పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి
- కుడా చైర్మన్, కలెక్టర్, కమిషనర్, ఇతర అధికారులతో సమీక్ష

**వరంగల్ వాయిస్, హనుమకొండ :** వరంగల్ పశ్చిమ నియోజకవర్గంలో వివిధ అభివృద్ధి పనులను పరుగులు పెట్టించాలని, త్వరగా పూర్తయ్యేలా అధికారులు చర్యలు చేపట్టాలని ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి అన్నారు. గురువారం హనుమకొండ జిల్లా కలెక్టరేట్ లోని మినీ కాన్ఫరెన్స్ హాలులో వరంగల్ పశ్చిమ నియోజకవర్గంలోని భద్రకాళీ దేవాలయం మాఢ వీధుల నిర్మాణం, కాకతీయ మ్యూజికల్ గార్డెన్ పునరుద్ధరణ పనులు, వేయి స్తంభాల దేవాలయం, సివిల్ సప్లై గోదాంలు, కాజీపేట ఆర్ఓబీ తదితర అభివృద్ధి అంశాలపై కుడా చైర్మన్ ఇనగాల వెంకట్రాం రెడ్డి, హనుమకొండ జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్, గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కమిషనర్ చాహత్ బాజ్ పాయ్, జిల్లా అదనపు కలెక్టర్ వెంకట్ రెడ్డి, హనుమకొండ ఆర్డీవో రాథోడ్ రమేష్, కుడా పీవో అజిత్ రెడ్డి, ఆర్ అండ్ బి ఈఈ సురేష్ బాబు, భూమి కొలతల శాఖ ఏడి శ్రీనివాసులు, ఇతర శాఖల అధికారులతో ఎమ్మెల్యే సమీక్ష నిర్వహించారు. ఈ సమావేశంలో కుడా ఈఈ భీమ్ రావు, హౌసింగ్, రెవెన్యూ, సర్వే, ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.

## నిమజ్జనానికి పకడ్బందీగా ఏర్పాట్లు..

గణపతుల నిమజ్జనోత్సవానికి ఇబ్బందులు తలెత్తకుండా పకడ్బందీగా చర్యలు చేపట్టాలని వివిధ శాఖల అధికారులను హనుమకొండ జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్ ఆదేశించారు. ఈ కార్యక్రమంలో టీజీ ఎన్పీడీసీఎల్ ఎస్ఈ మధుసూదన్ రావు, కాజీపేట తహసిల్దార్ భావు సింగ్, హనుమకొండ నాయబ్ తహసిల్దార్ రంజిత్ కుమార్, మున్సిపల్, రెవెన్యూ, ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.



# సమాజ నిర్మాతలు గురువులు

## టీచర్స్ డే సందర్భంగా ప్రత్యేక వ్యాసం

సనాతన ధర్మంలో గురువుకు ఉన్న స్థానం అత్యున్నతమైనది. గురు బ్రహ్మ, గురు విష్ణు, గురు దేవో మహేశ్వర.. అనే శ్లోకం గురువును సృష్టికర్త బ్రహ్మగా, సంరక్షకుడు విష్ణువుగా, విధ్వంసకుడు మహేశ్వరుడిగా కీర్తిస్తుంటాము. ఈ మూడు శక్తుల కలయికే గురువు. విద్యార్థి జీవితాన్ని జ్ఞానంతో తీర్చిదిద్దే దీపం గురువు. తల్లిదండ్రుల తర్వాత విద్యార్థి జీవితానికి రెండో ఆధారం ఉపాధ్యాయుడు. విద్యార్థి తన జీవితంలో ఎక్కువ సమయం పాఠశాలలోనే గడుపుతాడు. ఈ సమయంలో ఉపాధ్యాయుడు విద్యార్థికి రెండో తల్లిదండ్రి పాత్ర పోషిస్తాడు. తల్లి ప్రేమ, తండ్రి క్రమశిక్షణ ఈ రెండింటినీ గురువులో చూడవచ్చు. పాఠశాలలో స్నేహితునిలా బోధించడం, తల్లిదండ్రుల్లాగా శ్రద్ధ చూపించడం ద్వారా విద్యార్థికి గురువుతో బలమైన అనుబంధం ఏర్పడుతుంది. విద్యార్థిని సంస్కారవంతుడిగా, జ్ఞానవంతుడిగా తీర్చిదిద్దే బాధ్యత గురువుదే. గురుకుల వ్యవస్థలో విద్యార్థులు గురువుకు సేవ చేస్తూ విద్యను నేర్చుకునేవారు. ఇప్పుడు కాలం మారింది, పాఠశాలలు ఇంటి దగ్గరకే వచ్చాయి. ఆధునిక యుగంలో ఉపాధ్యాయులు సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి బోధిస్తున్నారు. డిజిటల్ యుగంలో సెల్‌ఫోన్ వంటి వాటి వల్ల విద్యార్థులు దృష్టి మళ్ళించడం ఒక పెద్ద సవాలుగా మారింది. ఈ సవాలును అధిగమించి, ఉపాధ్యాయులు మరింత ఆకర్షణీయంగా బోధించాల్సిన అవసరం ఉంది. ఇది ఉపాధ్యాయుని సృజనాత్మకతకు పరీక్షగా నిలుస్తోంది. డిజిటల్ టెక్నాలజీని సవాలుగా కాకుండా అవకాశంగా మార్చుకుంటేనే గురువు నిజమైన ఆధునిక మార్గదర్శకుడు అవుతాడు.

ఒక ఉత్తమ గురువు కేవలం పాఠాలు చెప్పడం మాత్రమే కాదు.. విద్యార్థుల మనసులో స్ఫూర్తిని నాటుతాడు. వారి బోధనలో విలువలు, నీతులు, జీవన మార్గాలు దాగి ఉంటాయి. అటువంటి గురువు చెప్పిన మాటలు జీవితాంతం గుర్తుండిపోతాయి. గురువు ఒక వ్యక్తిని మాత్రమే కాకుండా, మొత్తం సమాజాన్ని తీర్చిదిద్దుతాడు. ఒక మంచి గురువు మార్గదర్శకత్వం పొందిన విద్యార్థి జీవితం వెలుగులతో నిండిపోతుంది. డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ జీవితం గురువుల గౌరవానికి ఒక గొప్ప ఉదాహరణ. ఆయన ఊరు మారుతున్నప్పుడు, గుర్రపు బగ్గీని విద్యార్థులు స్వయంగా లాక్కెళ్లి తమ అభిమానాన్ని చాటుకున్నారు. ఈ సంఘటన గురువుకు, విద్యార్థులకు మధ్య ఉన్న అనుబంధాన్ని తెలియజేస్తుంది. అందుకే ఆయన పుట్టినరోజును మనం ఉపాధ్యాయ దినోత్సవంగా జరుపుకుంటున్నాం. ఆయన ఆదర్శాలు నేటి విద్యా విధానానికి పునాదులుగా నిలిచాయి.

గురువులే సమాజ మార్గదర్శకులు. గురువులు విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దేవారు. సమాజానికి అవసరమైన మానవ విలువలు, నైపుణ్యాలను వారే విద్యార్థులకు అందిస్తారు. కొత్త ఆవిష్కరణల వైపు వారిని నడిపిస్తారు. మంచి పౌరులుగా తీర్చిదిద్దడం ద్వారా దేశాభివృద్ధికి దోహదపడతారు. ఉపాధ్యాయులు లేకపోతే సమాజం చీకటిలో ఉండిపోతుంది. అందుకే గురువులను సమాజ మార్గదర్శకులు అని పిలుస్తారు.



రచయిత
ముదిరి నాగరాజు
సెల్ నెంబర్
96765 12489

EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY GADDAM KESHAVA MURTHY, PRINTED AT MANIKANTA GRAPHICS, H.NO.4-10-121, KUMARPALLY, HANAMKONDA, WARANGAL URBAN DISTRICT-506001, TELANGANA STATE, PUBLISHED AT H.NO. 4- 7-138/1, KUMARPALLY, HANAMKONDA, WARANGAL.-506001. WARANGAL URBAN DISTRICT, TELANGANA STATE.
EDITOR : GADDAM KESHAVA MURTHY. RNI NO: TELTEL/2021/80377, PHONE NO : 8008794162, MAIL ID : gaddamkeshavamurthy@gmail.com